వాకాటి పాండురంగారావ్



నిప్పు

ఎఱ్ఱటి పూలతో ఒళ్ళు విరుచుకుంది కిటికీబయట కానుగచెట్టు.

కిటికీకి ఇవతల, మేడమీద 'గదిలో ఈజీచేర్‌లో పడుకుని వున్నాడు పద్మనాభం. సాయంకాలపు ఎండలో కానుగచెట్టొక హోమగుండంలా వెలుగుతుంటే, ఆ అందాన్ని అనుభవిస్తున్నాడు పద్మనాభం.

ఏడేళ్ళ కింద సరిగా ఈ ఆగస్టు తొమ్మిదిన – పెళ్ళి పీటలమీద తనకూ సీతకూ మధ్యవున్న మధుపర్కాన్ని తొలగించినప్పుడు, తనకన్నులామె వదనంమీద నిలిచినప్పుడు, ఆమె ముఖంమీద కుంకుమ వర్షించలేదా... ఆ వర్షం గుర్తొచ్చింది ఈ పువ్వుల్ని చూస్తుంటే;

చటుక్కున వెనక్కు తిరిగి చూశాడు.

అయిదారు నిముషాలనుండి ఆ గది గుమ్మంలో నిల్చుని చూస్తున్న సీత నవ్వింది.

నెమ్మదిగా అడుగులువేసి అతడి ప్రక్కగా కుర్చీని లాక్కుని కూచుంది.

'చాలసేపయిందా?' పద్మనాభం అడిగాడు.

'అబ్బే, ఇపుడే... మీరా కిటికీబయటకు చూస్తుండగా వచ్చా.' అంటూ అతడి నోటికొక బర్ఫీముక్క నందించింది.

'సీతా! ఆ ఎఱ్ఱటిపువ్వుల గుత్తుల్ని చూస్తుంటే వధువు మొహంమీద సిగ్గు వేసిన ముగ్గుల్లా లేవూ.'

'ఉహూ! బొత్తిగాలేవు! ఆన్ ది అదర్ హేండ్ నా ఇంగ్లీషు ఆన్సర్ పేపర్‌మీద మా రమణయ్య మేష్టారు ఎఱ్ఱపెన్సిలుతో చుట్టిన సున్నాల్లా వున్నాయి.'

పద్మనాభం ఫక్కున నవ్వాడు.

సీతా నవ్వింది.

'అయినా అద్దె కొంపలో వుంటూనే పరిసరాలమీద ఇంత మమకారం అయితే...' అనబోయిన సీతకు అడ్డు వచ్చాడు పద్మనాభం.

'ఏం, ఇంకో ఏడాదిలో మన ఇల్లంటూ ఒకటి వుంటుంది లేవోయ్... మా ఆఫీసు సొసైటీ వాళ్ళు ఆ స్థలాన్ని ఈ వారం ఖాయం చేస్తున్నారు. నిన్ననే బ్యాంకినుండి ఆరువేలకా తెచ్చి ఇంటో వుంచాను.'

'ఆరువేలతో అయిందా! 'ఇల్లు కట్టి

చూడు' అన్నారు మరి' అని ఆర్యోక్తిని వల్లించింది ఆర్యపత్ని సీత.

'నమ్మకం లేకపోతే సరేనేయ్. వచ్చే ఆగస్టునాటికి మన ఇంట్లో మనం వుంటాము. ఆఁ! మరి ఈలోగా అబ్బాయి కూడా ఆవతరిస్తే!'

ముడివడిన ఆ భ్రుకుటీ, కొనుక్కొచ్చుకొన్న ఆ కోపం అతడి మనసున మల్లెలు పూయించాయి.

—'అమ్మా! వాళ్ల రవికీ, ఇంకో బిస్కెట్టు కావాలిటే' అంటూ పరుగెత్తుకు వచ్చింది అరుణ.

'ఇటు రా తల్లీ!' అని కూతుర్ని దగ్గరకు తీసుకుని, అలసిపోయిన దాని మొహం మీద చెమటను తుడిచి ముంగురులను సరిదిద్దాడు పద్మనాభం; బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు. ఇదేమీ పట్టించుకోకుండానే అరుణ 'అమ్మా! బిస్కెటివ్వవే, వెళ్లాలి' అంది.

'ఏవిటే ఆ తొందర, ఏదో కొంప అంటుకుపోతున్నట్లు. అయినా ఆ రవిగాడు నీకు ఏదీ ఒక్క పిసరు కూడా ఇవ్వడు గదా వాడికి నువ్వు రోజూ ఓ అరడజను బిస్కెట్లు ఎందుకివ్వాలీ అంట?' అని ప్రశ్నించింది సీత.

పెద్దవాళ్ల లాజిక్కేమీ అర్థం కాని అరుణ 'ఇవ్వమ్మా' అంది.

'అంతగా అది అడుగుతుంటే ఇవ్వరాదూ?' దాన్ని కూడా నీలాగే లోభిగా తయారుచేయడం ఎందుకూ?'

కొరకొరమని చూచింది సీత.

ఆరేళ్ళ అరుణకు నాన్న చెప్పిన మాటలన్నీ అర్థం కాలేదు కానీ, ఎప్పుడూ నాన్న తన పక్షమే మాట్లాడుతాడనీ, ఇపుడూ ఆపనే చేశాడనీ తెలిసింది దానికి. వంగి నాన్నచేతిమీద ముద్దు పెట్టుకుంది.

'బాగున్నారు నాన్నాకూతుర్లూ! అక్కడికి మీరు శిబి దధీచులలాగనూ, నేను పిసినిగొట్టునగా అన్నమాట, ఫరవాలేదు లెండి' అంటూ అలమారనుండి డబ్బాతీసి అరుణ చేతికి బిస్కెట్టునిస్తూ ఆర్గ్యుమెంటును సాగించింది సీత 'పోనీ ఒక బిస్కెట్ ఫ్యాక్టరీయన్నా పెట్టండి, దారిని పోయేవారందరికీ తలో పేకెట్టూ ఇవ్వవచ్చు...'

బిస్కెట్లు తీసుకున్న అరుణ—'అమ్మా! ఇంకొకటివ్వవే—'నీలా'కిస్తాను అంది.

'బాగుంది వరస, కుక్కలక్కూడా బిస్కెట్లా' అంది సీత. పద్మనాభం నవ్వాడు.

'అయినా కుక్కలకు ఈ బిస్కెట్లు ఏవిటండీ—'నీలా' కిస్తే దాని తల్లికీ, దాని పిల్లలకూ ఇవ్వొద్దూ?' అంటూ మరో మూడు బిస్కెట్లనిచ్చింది సీత. రాణికొకటి, నీలాకొకటి, మణికీ మాలకూ కలిపి ఒకటి—అని చెప్పింది అరుణతో.

గెంతుతూ వెళ్లింది అరుణ.

క్రింద బిర్రుమని చప్పుడయితే, వీధిలోకి తొంగిచూశాడు పద్మనాభం. లారీ ఒకటివచ్చి పక్కింటి ముందర ఆగింది. దాన్నంతా ఫిల్ము నెగెటివులున్న చెక్కపెట్టెలున్నాయి. మెట్లు దిగుతున్న అరుణవైపు చూస్తూ అరిచాడు పద్మనాభం.

'లారీవుంది—జాగ్రత్తగా రోడ్డు దాటి వెళ్లమ్మా' అన్నాడు పక్కింటి వరదరాజులు గారిగురించి ఆలోచిస్తూ. ఆయన వేస్టు ఫిల్ము నెగెటివ్‌లతో సంచులు చేయించి టోకుగా అమ్ముతాడు; ఎగుమతి కూడా చేస్తాడు. ఒంటరిప్రాణి. అయితేనేం పదిలక్షలు బొత్తిగా చాలక పదకొండో దానికి పడగలెత్తుతున్నాడు, పాపం!

ఇవేమీ తెలియనిసీత ఆరో తరగతి సామాన్య గణితంలోకి దిగింది— 'అది కాదండీ! రోజుకి ఇరవై బిస్కెట్లయితే—నెలకెన్నిపొందులు కావాలో చెప్పండి—'

'దానికేం తెలుసు సీతా—అది చిన్నది...'

'ఏం చిన్నదో —'ఇది నావస్తువు, పోతే మళ్లీరాదే—' అని తెలియకుండా పెరిగితే ఎట్లాగండీ? ఆఖరుకు తన బొమ్మల్నికూడ అడిగినవారికి ఇచ్చేసి వస్తుంది.. 'వాళ్ళ రమణ—అడిగిందే, ఇచ్చాను' అంటుంది ... ఏంచెయ్యడం దాంతో—'

'అట్లాగే పెరగనియ్యి దాన్ని! వస్తువులు పోతే పోయె ఆ మంచి తనంతోనే అరుణ పెరిగి పెద్దదవ్వాలి. మంచి మనుష్యులు పదిమంది వుంటే బ్రతుకన్నది ఎంతో అందంగా వుంటుంది.'

'మాట్లాడితే చాలు! మంచితనం, సహృదయం, సౌజన్యం అంటూ బయల్దేరుతారుమీరు... రెండు నిముషాలు వింటే ఐక్యరాజ్యసమితిలో కూచున్నట్లుంటుంది.'

'అబ్బో, సమితీ గిమితీ గట్రా అంటున్నావు—దినపత్రిక చదువుతున్నావేమిటి మధ్య!'

'దినపత్రికా ? చదవడమా ? మాబోటి సామాన్యులా ?' అని ఆశ్చర్యం ప్రకటించిందామె.

గలగలమని నవ్వాడు పద్మనాభం.

ఇంతలో వాళ్ళమ్మ గదిలోకి ప్రవేశించింది. సీతలేచి నిల్చుంది. 'ఒరేయ్! కృష్ణారావూ వాళ్ళూ వచ్చార్రా!' అంటూ కోడలివైపుచూచి—' ఈ 'భక్త విజయం' అక్కడ వుంచేసి 'కృష్ణ కర్ణామృతం' అందుకో అమ్మాయ్!' అంది ముసలావిడ.

అత్త అడిగిన పుస్తకం అందించి బయటకు అడుగుపెడుతున్న సీతకు నమస్కరించి, లోపలికి నడచారు కృష్ణారావూ ధనంజయుమూ.

'ఏరోయ్! కొత్త పెళ్ళికొడుకులా ఉషారుగా వున్నావూ ?'

వెనక గదిలోకి వెళ్తూ ఆమాట విన్న సీత మొహం గుప్పు మన్నది ఎర్రదనంతో.

— ఆ రాత్రి తొమ్మిదింటికి పద్మనాభం భోజనం చేసి చేయి కడుక్కుంటుండగానే మిత్ర బృందం వీధిలోనుండి అరిచింది. ఓడియన్ లో 'బెక్కెట్' చూడాలని కార్యక్రమం సాయంకాలమే పద్మనాభానికి చెప్పివెళ్ళారు. ఠంచన్‌గా అప్పుడే వాళ్ళల్లా వచ్చేశారు!

వెళ్తూ వెళ్తూ నిద్రపోతున్న అరుణను ముద్దు పెట్టుకున్నాడు పద్మనాభం.

'పన్నెండవుతుందా' అని అడిగింది సీత.

'అవ్వొచ్చు'

'క్రిందివాళ్లు వూళ్లో లేరుకదా—మీరు వీధికి తాళంపెట్టుకు వెళ్ళండి. వచ్చేటప్పుడు బస్ కోసం పడిగాపులు గాయక టాక్సీలో రండి.' అంది సీత

'అట్లాగే!'

'చీకటివేళ! జాగ్రత్తగా వెళ్ళిరారా అబ్బాయ్' అంది పద్మనాభం వాళ్ళమ్మ. నవ్వుకుంటూ వీధిలోకి అడుగుపెట్టాడు. వాళ్ళమ్మ కన్న ఆరుగురు సంతానంలో మిగిలినవాడతడొక్కడే.

వీధిలో మిత్రులతోకలిసి పది అడుగులు వేశాక తటాలున వెనక్కు తిరిగాడు పద్మనాభం.

కాముగ చెట్టు నీడ పడుతున్నా తాను మేడమీది కిటికీలోనుండి తనవైపు రెండు నక్షత్రాలు చూడడం కన్పించింది. గర్వంగా బాధగా బరువుగా ఏదోగా అనిపించింది. వెనక్కు పారిపోదా మనిపించింది.

'అబ్బ! జనం నవ్వగలరు' అని తన్ను తానే మందలించుకున్నాడు.

ఎందుకో ఒక్కోరోజు హాయిగా, సంతృప్తిగా, నిండుగా వుంటుంది. అంత ఎత్తులోనే లోతుగా భయంవేస్తుంది. ఇదంతా ఇట్లాగే వుంటుందా—నిజంగా వుండగలదా అన్పిస్తుంది. అదొక అరక్షణమే!

ఆ నిండుదనమూ, ఆ సంశయమూ ఇవాళ తనతో చేతులు కలిపాయి.

మధ్యాహ్నం వచ్చి వాళ్ళిద్దరూ బలవంతం చేశారు కాబట్టి తాను పూట సినిమాకు వెళ్తున్నాడు గాని లేపోతే— ఇంట్లోనే ఉండిపోయేవాడు.

అరుణ పెద్దదయింతర్వాత వైద్యమూ, శాస్త్రమా ఏది నేర్చుకోవాలి అన్నదానిని గురించి, దాని పెళ్ళిగురించి, తాము కట్టబోయే ఇంటిలో ఏర్పరచవలసిన సౌకర్యాలగురించి. తోటలో వేయవలసిన మొక్కలగురించి, ఒకానొకనాడు రైల్లో ఒకరినొకరు చూచుకుని తలిదండ్రుల ద్వారా తాము వివాహాన్ని ఎట్లా సాధించారో అన్నదాన్నిగురించి— మాట్లాడుకునేవారు

నిప్పు

తనూ సీతా.

లేకపోతే చదరంగం ఆడుకునేవారు.

లేకపోతే అమ్మ తన చిన్నప్పటి కబుర్లు, బంధువులతో కోర్టుకేసులు— చెబుతుంటే వినేవారు.

'ఓరబ్బ బంగారుసామీ! ఆ బెంగంతా నీ ఆవిడకోసమే?' అన్న ధనంజయం గొంతు పద్మనాభాన్ని బస్‌స్టాండ్‌లోకి లాక్కు వచ్చింది.

'బెకెట్' చూశారు హాలునుండి బయటకు వచ్చారు.

'రిచర్డ్ బర్టన్ అద్భుతంగా నటించా' డని కృష్ణారావ్ గోలపెడితే, 'కాదు! పీటర్ ఓ టూ లే ఆకాశాన్ని అందుకున్నాడ'ని ధనంజయం ఢంకా బజాయించాడు.

పద్మనాభం తన ఓటు ఎవరికీవెయ్యలేదు.

నిండయిన తన ఆ దినానికి ఆ సినిమా ఒక చక్కటి ముగింపులా వుంది అనుకున్నాడు. దాన్ని గురించి మాట్లాడడం అతడి కిష్టం లేదు.

అతడు ఆరో నెంబర్ బస్సెక్కాడు. వాళ్ళిద్దరూ మరో బస్సెక్కారు.

బజార్ దగ్గర బస్ దిగాడు పద్మనాభం.

చల్లగా వేగంగా వీస్తోంది గాలి. చొక్కా కాలర్ బటన్ వేసుకుని, గబ గబ నడవసాగాడు పద్మనాభం.

ఖర్చులకు చాలని జీతం రకాసాయులులా, చీకటికి చాలని దీపాలు వీధి కిటూ అటూగా పహరా కాస్తున్నాయి.

తోక తెగిన కుక్క ఒక్కటి పద్మనాభాన్ని చూచి మొరిగింది. అతడు తన దారిన తాను పోవడం చూచి విసుగెత్తి వూరుకుంది.

సరస్వతీహాల్ దాటి పెద్దవీధిలోకి వచ్చాడు. ఈలవేసుకుంటూ వెళ్తాడొక సైకిల్ రిక్షా వాడు. ఇంకో ఫర్లాంగులో వుంది ఇల్లు.

ఈపాటికి సీత కూడా మంచి నిద్రలో వుంటుంది.

—అమ్మ పెద్దదయింది, ఒక్కోరోజయితే ఏ రెండు గంటలకోగాని నిద్రపోదు.

వాచి చూచుకున్నాడు పద్మనాభం. పన్నెండూ ఇరవై అయింది.

మలుపు తిరిగి, తన వీధిలోకి అడుగు పెట్టిన పద్మనాభానికి—

రాత్రిలో నుండి పగటిలోకి నడిచినట్లయింది.

తల్లి గర్భంలోనుండి ప్రపంచంలోకి పడ్డట్లయింది.

వీధి వీధంతా ఎర్రటి వెలుగులో, ముక్కును చీలుస్తున్నట్లు వెచ్చటి వాసనతో బిల బిల లాడుతూంది.

వేడిగా వెలుగు, తెల్లగా పొగ, పెద్దగా అరుపులు, తెరిచిన తలుపులు, చూస్తూ, అరుస్తూ, నిలుస్తూ, పరుగెడుతూ, ఇంకా ఏదేదో చేస్తూ మనుషులు— ఏదో ఎర్రటిబండ్లు— లారీలవంటిబండ్లు— బండ్లవంటిలారీలు—

'ఏమిటిదంతా?' అని గట్టిగా అరిచాడు పద్మనాభం.

ఎవరికీ వినపడలేదు ఆప్రశ్న.

ప్రశ్నకాదది— పదివేల బాంబులు ఎదలో పేలిన శబ్దం అది.

పరుగెత్తాడు పద్మనాభం ఎవరో ఆపారు.

సురాసురులెవరో కోలాహలంగా దీపావళి పండగ చేసుకుంటున్నట్లు—శివుడి మూడవ కన్ను తెరుచుకున్నట్లు— వియత్తాం ఎగిరి వచ్చి ఆవీధిలోపడ్డట్లు—ఆకలితో కడుపు కాలినట్లు— మానభంగంతో శీలం గింజుకున్నట్లు — మహాచిత్రకారు డెవరో అతి మనోహరమూ మహోగ్రకారమూ అయిన



చిత్రాన్ని రచిస్తున్నట్లు—పూర్వజయాపజయాలు, దిసహారియుసులు రెండూ కలిసి విందు చేసుకుంటున్నట్లు— రక్తమాంసాలు భక్షిస్తున్న రాక్షసుడు నవ్వుతున్నట్లు—మండుతూంది.

—నీవే తప్ప నితఃపరం బెరుగనంటూ భక్తుడు పైకెత్తిన చేతులవలె మంటల నాలుకలు ఆకాశంలోకి లేస్తున్నాయి.

ఏనుగుతొండాలవంటి రబ్బరు గొట్టాల్లోంచి నీళ్లు ఉత్సాహంతో ఎగిరివెళ్లి నిప్పుతో పడిపోతున్నాయి.

ఎక్కడో మూల్గులు: ఏవో—అరుపులు.

నిప్పు— మంట— నీరు — పొగ వీటి దాగుడుమూతలమధ్య' వాలుగయిదుఇళ్లు—మరొకలోకానికి చెందినవాటిలా —దివ్య తేజంతో వెలుగుతున్నాయి.

ఆమధ్యది తనఇల్లు—తాను, పద్మనాభం వుంటుండే ఇల్లు, వుండిన ఇల్లు.

ఎక్కడ, అరుణ ఎక్కడ?

సీత ఏది? అమ్మ ఏమయింది?

ఈ నిప్పు—ఈ ప్రళయం—ఈదావానలం —ఎవరు పిలిచారు దీనిని?

వాళ్లు—వాళ్లు ఏరీ? లోపల వుండడానికి వీలులేదు. ఉండరాదు. ఉండి ఉండరు.

'మొదట ఆ పెట్రోలు యార్డుకు నిప్పంటుకున్నదంట — టాంకులు పేలగా ఆ పెట్రోలు వర్షంలో తడిశాయి ఈ ఇళ్ళు అంతా, ఈ వరస వరసంతా నిముషంలో భగ్గుమని అంటుకుంది. అందులో, ఇదిగో ఇవతల ఆ రెండస్తుల ఇల్లుంది చూశారూ, దాన్నిండా ఫిల్ము నెగెటివ్‌లే !! పెట్రోలు, ఫిల్మూ—ఇంతకన్నా అగ్నిదేవుడికి ఏం కావాలి చెప్పండి.' ఎవరో ఒక బుర్రమీసాల జ్ఞాని చాలమంది అజ్ఞానులకు కథా క్రమాన్ని వివరిస్తున్నారు... 'ఇళ్లల్లోని వాళ్లు నిద్రమేల్కొని బయటికి రావడానికి కూడా అవకాశం లేకపోయిందట!' అన్నాడింకోఆయన.

ఎవరో కేకపెట్టారు.

పిడుగుపడ్డట్లు పడిందొక ఇల్లు.

అది ఆకొసనున్న ఇల్లు—దానిపక్కది తనఇల్లు—తన ఇంటికి తాను సురక్షితంగా పిడుగువర్షిన్న తాళం కప్పవేసుకుని మరీ వెళ్లాడు. పద్మనాభం గుండెలో పలికినట్లైనట్టుంది.

నిప్పు

పరుగెత్తాడు పద్మనాభం. పరుగెత్తాడు నిప్పులోకి.

ఇద్దరు కాకీ చొక్కాలవాళ్లు పట్టుకు ఆపారు.

ఒక్కఊపుతో వాళ్లని విదిలించుకుని పడ్డాడు నిప్పుల్లోకి ఎట్లా వెళ్లాడో ఏమో ఆ మంటలలో తన ఇంటిని పవిూపించాడు. తలుపులు రెండూకాలి ఎర్రగా నవ్వుతున్నాయి. కానుగచెట్టొక అగ్ని పర్వతంగా కాలుతూంది.

బయటనుండి హోరుమంటూ చప్పుడు. బావురుమంటూ కేకలు. ఆ నిశిరాత్రివేళ ఎక్కడచూచినా ఎర్రటి పగలు !

పద్మనాభం లోపలికి దూకాడు.

బట్టలు కాలుతున్నట్లున్నాయి.

లోపల అంతా మంటలే. ఎత్తుమంటలు, పొట్టిమంటలు, ఎర్రమంటలు, పసుపు మంటలు, తెల్లమంటలు.

వీటిలో ఏ మంట ఒకప్పటిగది?

ఏ మంట వరండా?

మెట్లున్నవి మండుతుంటే ఎట్లా వుంటాయి?

ముంగిలిప్రక్కగా గోడ పడిపోయివుంది.

దానిమీద కెక్కి, వేలాడుతున్న గొట్టాన్ని దేన్నో పట్టుకున్నాడు. చేతులు కాలాయి. కాని వదలలేదు.

మేడవరండా గోడ క్రిందిభాగం అందింది. పైకి పాకాడు పద్మనాభం.

ఇది మేడ—ఇది వరండా... ఇక్కడ అమ్మ వుండాలి. ఆ ముందు గదిలో సీత, అరుణ వుండాలి.

అదేమిటి ఆ మూల పడివున్నది— కుక్క కదూ ? అవును...'నీలా'నా ? రాణీయా? ఎముకలకు, బూడిదకు పేర్లేమిటి ?

ఫెళఫెళ మంది—పక్కిల్లుకాదు. ఈ ఇల్లే ! ముందు భాగం కూలింది. కానుగ చెట్టు కూలి మసి అయింది.

తలుపులు తోసుకుని జన సందోహం కోటలోకి వచ్చినట్లుగా భగ్గుమని మంట లోపలికి వచ్చింది. చిటపటలాడుతూ చిన్నగా పెద్దగా మండుతున్న తలుపులు, దూలాలు, కిటికీలు, పత్రికలు. పెల్లుబలు—అన్నీకూడా తమ నఖుడు, తమ ప్రియుడు, తమగురువు, తమ ప్రాణము అయిన ఆ మంట పై ఆనందంతో చేతులు జాచాయి.

వెనకగది గడప దగ్గర పడిపోయివున్న అమ్మ కనపడింది. పరుగెత్తిపోయి పట్టుకుంది ఆమె.

మెట్లు వేపు కుళాయి ముందర బోర్లా పడివుంది సీత! ప్రక్కనే అరుణ. వీళ్ళని పడవేసింది నిప్పుకాదు ; అంతకన్న భయంకరమైనది—భయం !

అమ్మ—సీత—అరుణ—అన్నీ తానే !

నిన్న—నేడు—రేపు—మూడూ తనవే !

— ఇంకొన్ని నిముషాలు నిలవదీ భవనం. ముత్తయ్య మొదలియారు జనులకు అప్పులిచ్చి, ఆ జనులను పిండివడ్డీ వసూలు చేసి, వారి ప్రాణాలు ఇటుకలుగా, వారి కన్నీళ్ళు సిమెంటుగా కట్టిన ఈ గట్టిఇల్లు కూలబోతున్నది.

ఇంటికన్న ముందు తానుకూలడం తథ్యం.

తను—పద్మనాభం అనే మనిషి రేపు ఇంకో సంవత్సరం లోగా స్వీయార్జితంతో ఇల్లుకట్టి, దానిముందర కానుగ చెట్లునాటి, వాటి పూవుల ఎర్రటి అందాన్ని చూచి మురిసి పోవలసిన వాడు, సీత చెక్కిళ్ళపైది సిగ్గురుపుతో తన ఆనందాన్ని కొలుచుకో దలచినవాడు, అరుణ జీవితంలో తన జీవితపు ఎక్స్‌టెన్షన్ చూచుకుని చిరంజీవిలా నవ్వ వలసినవాడు, కొడుకుని కోడల్ని మనవరాల్ని చూసి మురిసి పోయే ముసలితల్లి ఆనందపు వన్నెల జల్లులో హరివిల్లులు లెక్కించవలసిన వాడు —

ఆ పద్మనాభం—నేడు—ఇప్పుడు
ఎర్రటి వెలుతురు మధ్య,
నిప్పు కప్పుల నాలుకల చివర నిలబడ్డాడు.
అమ్మ!—తన్ను కన్న తల్లి.
తనలో సగం సీత.
—తమ ఇంటి వెలుగు—అరుణ.

ఇల్లంతా కంపించినట్లయింది.

తీసుకుని బయట పడాలి ఎవరిని? ఎవరిని? ఎవరిని? ఎవరో ఒకరినే! అయితే ఎవరిని?

ప్రాణమిచ్చిన అమ్మనా? ప్రాణంలో సగం సీతనా? తను ప్రాణంపోసిన అరుణనా?

'ఎవరిని? ఎవరిని? ఎవరిని? అయి? ఎవరిని? ఎవరిని? ఎవరిని?' అని పాడుతూ సంతోషంతో నర్తిస్తున్నాయి నిప్పురవ్వలు,

శాంతని పేలింది వెనకవైపు దూలం.

పద్మనాభం పిలిచాడు: 'అమ్మా! అరుణా! సీతా! జవాబుగా మూలిగా రెవరో! అమ్మ దగ్గరకు వెళ్లి ముక్కు దగ్గర వేలు పెట్టాడు. అంత వేడిలోనూ మనిషి ఊపిరి నెమ్మదిగా పీల్చింది. పరుగెత్తి, సీతను కదిలించాడు. ఆమె పెదవులేవో కదిలాయి. అరుణను లేపి కూచోపెడితే అది కళ్లు తెరిచింది; అక్కడ ఎర్రటి భయం తప్ప మరోటి లేదు.

తన విజయానికి తృప్తి పడి నిప్పు నవ్వింది కాబోలు. ఇల్లు కదల సాగింది. మండుతున్న కర్ర ఒకటి పద్మనాభం ప్రక్కగా పడింది. దానిని ఒక్క తన్ను తన్నాడు. చూస్తూండగా వరండా గోడ పడిపోవడం మొదలయింది. ఆ ఊపుకు తాను క్రింద పడ్డాడు.

అతడి కళ్లల్లో ఆశ వచ్చింది.

ఆఖరుసారిగా శక్తినంతా కూడగట్టుకుని లేచాడు.

రెండు చేతులకు అడ్డంగా వేసుకుని అడుగులు వేశాడు. ఇంటి వెనక వేపుకు నడిచాడు. తూలి పడబోయి, అతి కష్టం మీద నిలవగలిగాడు. నెమ్మదిగా పగిలిన వంటింటి గోడ కిటికీ పడిపోయిన పక్కింటి వైపుగా నిలిచాడు.

ఆరుతున్న మంటలు, మెరుస్తున్న టోపీలు, నల్లటి మొహాలు.

ఎవరో అరిచారు.

క్రిందికి దూకాడు పద్మనాభం.

ఎవరో ఎవరినో లాక్కుపోతున్నట్లు, అయినా ఆ విషయం తనకు తెలిసినట్లు ఆ ఎవరో తనే అయినట్లు, అయినా తాను కానట్లు అనిపించింది పద్మనాభానికి

తలదగ్గర బాంబు పేలినట్లయింది.

అతడి ఇల్లు కూలింది.

*　　*　　*

ఆరు రోజుల తర్వాత ఒక ఉదయాన ఆస్పత్రిలో కళ్లు తెరిచిన పద్మనాభాన్ని పిస్టర్ శాంత చిరునవ్వు పలకరించింది.

'హమ్మయ్య!' అంది శాంత.

ఆమెను తదేకంగా చూశాడు పద్మనాభం. అతడి ఒళ్లంతా మేకులు దిగగొట్టినట్లుంది. తానొక మండుతున్న ఆగ్గిపెట్టె అన్పించింది పద్మనాభానికి.

'మీ అమ్మాయి బాగుంది!' అంది శాంత.

పద్మనాభం ఏదో అడిగాడు; కాని అతడి పెదవులనుండి మాటేదీ బయటకు రాలేదు.

'ఇపుడేమీ మాట్లాడకండి.' అంది శాంత. కళ్లుమూసుకున్నాడు పద్మనాభం.

సాయంకాలం కళ్లుతెరిచినప్పుడు కనపడ్డ డాక్టరునడిగాడు' సీత, అమ్మ ఎక్కడ?'

డాక్టరు ఏమీ పలకలేదు. పద్మనాభం కళ్లు మూసుకున్నాడు. డాక్టరు నెమ్మదిగా అతడి కన్నీళ్లను తుడిచాడు.

మరుసటిరోజు సాయంత్రం పద్మనాభాన్ని చూడడానికి ధనంజయమూ కృష్ణారావూ వచ్చారు.

చాలసేపు వాళ్లని చూశాడు పద్మనాభం. వాళ్లేమీ మాట్లాడలేదు.

చివరకు ధనంజయం చెప్పాడు 'ఆ అయిదు ఇళ్లూ నాశనమయ్యాయిట.'

కృష్ణారావ్ చెప్పాడు— 'మీ ఇంటి కుక్క పిల్లలు మణి, మాల క్షేమంగా వున్నాయి. వాటిని వాళ్లమ్మ నీలా నోట్లో కరుచుకుని బయటికి తెచ్చిందిట ఆరోజు!'

అయితే ఆ చచ్చిపోయినది ముసలికుక్క రాణి అన్నమాట అనుకున్నాడు పద్మనాభం.

నీలాకూడా తనపిల్లలను రక్షించుకుంది. అమ్మను, పెద్దదానిని, పెంచినదానిని మరిచి పోయింది.

మరితానో?

తానూ అంతే!

ఏప్రాణికయినా జీవితంలో ఒక్క అమ్మే వుంటుంది.

ఆ అమ్మను వదలుకున్నాడు తాను.

తనలో ఒకభాగం ఆ జ్వాలలో ఒక కీలగా అయింది.

—మరుసటిరోజు ఉదయం, అందరి జీవితాలనూ క్రొత్తగా చిగుళ్ళు తొడుగుతున్న వేళ శాంత వచ్చింది పద్మనాభం గదిలోకి.

'రేపు పొద్దున్న మీ అమ్మాయిని మీవాళ్లు చూడవచ్చండోయ్' – అంది గలగలలాడుతూ.

పద్మనాభం కండ్లు అప్పుడే శాంత సర్దిన ఫ్లవర్‌వాజ్ మీదకు వెళ్లాయి.

అక్కడొక గులాబీమొగ్గ—'రేపు అన్నది వాది'—అంటూ నవ్వింది ఎర్రగా. ●